ఆంధ్రజ్యోతి
ఉష్ణోగ్రతలు | గరిష్ఠం : 29.0 | కనిష్ఠం : 18.0
ANDHRAJYOTHY
5
మహబూబ్‌నగర్
జిల్లా వార్తలు
సోమవారం 29 జనవరి 2024



వాగులో పడి శివస్వామి మృతి

మదనాపురం, జనవరి 28: స్నానానికి వాగులోకి వెళ్లి శివస్వామి మృతి చెందిన సంఘటన వనపర్తి జిల్లా మదనాపురం మండలం దంతనూరులో ఆదివారం సాయంత్రం చోటు చేసుకుంది. దంతనూరు గ్రామానికి చెందిన వడ్ల శ్రీను (55) శివమాల ధరించాడు. సాయంత్రం స్నానం చేయడానికి గ్రామ సమీపంలో ఉన్న ఊకచెట్టు వాగులోకి వెళ్లాడు. అక్కడే దుస్తులు ఉతికి, ఆరేశాడు. స్నానం చేస్తుండగా, వాగులో మునిగిపోయి మరణించాడు. ఈత రాకపోవడంతోనే ఈ ప్రమాదం జరిగింది. శ్రీనుకు భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు.



తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకం (ఫైల్)



పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మించిన ఏదుల పంప్‌హౌస్(ఫైల్)

సాగునీటి రంగంపై.. ఫోకస్

- ఉమ్మడి పాలమూరు ప్రగతిపై ఫిబ్రవరి 11న పవర్ పాయింట్ ప్రజెంటేషన్
- వివరాలు సిద్ధం చేసుకోవాలని అధికారులకు ఆదేశాలు
- నీళ్లు తెచ్చామనే బీఆర్ఎస్ ప్రచారానికి చెక్ పెట్టే యోచన
- కాంగ్రెస్ హయాంలోనే పనులు జరిగాయని రూఢీకి యత్నం

గద్వాల, జనవరి 28(ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు కరువుతో విలవిల్లాడిన ఉమ్మడి పాలమూరు జిల్లాలో ఇప్పుడు పరిస్థితి మెరుగుపడింది. మెజారిటీ విస్తీర్ణానికి సాగు నీరు అందుతోంది. పంటల సాగు కూడా పెరిగి, ఉత్పత్తి.. ఉత్పాదకలో గణనీయమైన మార్పులు వచ్చాయి. మొన్నటి వరకు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం ఇదంతా తమ ఘనతేనని చెప్పుకోగా.. కాంగ్రెస్ తమ హయాంలో ప్రాజెక్టులు ప్రారంభించి, మెజారిటీ పనులు పూర్తి చేశామని చెప్పింది. అయినా.. బీఆర్ఎస్ హయాంలో ప్రాజెక్టుల నుంచి నీళ్లు పొలాలకు రావడంతో పనులు ఎవరు చేశారనే విషయంతో సంబంధం లేకుండా బీఆర్ఎస్ పార్టీ పలు ఎన్నికల్లో లబ్ధి పొందింది. కానీ గత ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమి చెంది, తిరిగి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. సీఎంగా రేవంత్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేసిన మొదటి రోజే నిర్వహించిన కేబినెట్ సమావేశంలో.. గత ప్రభుత్వంలో జరిగిన పనులు, చేసిన ఖర్చు, పనుల ప్రగతి, ఆస్తులు, అప్పులపై శ్వేతపత్రాలు అన్ని శాఖల వారీగా విడుదల చేస్తామని ప్రకటించిన విషయం తెలిసిందే. ఇప్పటికే పలు శాఖలపై శ్వేతపత్రాలు విడుదల కాగా, అతి ప్రధానమైన ఇరిగేషన్ శాఖ ఇంకా విడుదల చేయలేదు. ఇందుకు వివిధ స్థాయిల్లో అధికారుల వద్ద వివరాలు సరిపోలడం లేదని సీఎం రేవంత్‌రెడ్డి పలుమార్లు స్పష్టం చేశారు. అయితే శనివారం జిల్లాలో పర్యటించిన రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ.. వచ్చే నెలలో ఉమ్మడి పాలమూరు జిల్లా సాగునీటి రంగంపై పీపీటీ(పవర్ పాయింట్ ప్రజంటేషన్) ద్వారా వివరాలు వెల్లడిస్తామని తెలిపారు. ఈ మేరకు గద్వాల జిల్లాలో జరిగిన సమీక్షలో ఇరిగేషన్ అధికారులను నెట్టెంపాడు, తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకాల వివరాలను సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు.

పెండింగ్ పనులెన్నో..

వాస్తవానికి కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా 1, 2 ఎత్తిపోతల పథకాల కింద పూర్తి పనులు చేశామని బీఆర్ఎస్ ప్రభుత్వం చెప్పుకుంటున్నప్పటికీ.. ఏళ్లుగా ఇంకా అందులో అసంపూర్తి పనులు అలాగే ఉన్నాయని చెప్పడంలో అతిశయోక్తి లేదు. బీఆర్ఎస్ ప్రభుత్వం నీళ్లు ఇచ్చామనే చెప్పుకునేందుకు ఫాస్ట్రాక్ విధానంలో పనులు చేసిందే తప్ప.. ప్రత్యేక ఆయకట్టు స్థిరీకరణ చేయలేదని విమర్శలు వస్తున్నాయి. అలాగే ఫీడల్ ఛానల్ వ్యవస్థను తీర్చిదిద్దలేదని, పలుచోట్ల పునరావాసం పూర్తికాకపోవడంతో రిజర్వాయర్లు పూర్తిగా నింపుకోలేని దురవస్థలో ఉన్నామని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో గద్వాల జిల్లా పరిధిలోని నెట్టెంపాడు ఎత్తిపోతల పథకంలో అత్యంత కీలకమైన 99 ప్యాకేజీకి ఇప్పటికీ నీరందించడం లేదు. రెండేళ్ల క్రితం అగంతకులు షట్టర్లు తెరవడం వల్ల చాలా నీరు వృథాగా పోయింది. అలాగే ర్యాలంపాడు రిజర్వాయర్ వద్ద సీపేజీ ఎక్కువగా ఉంటోందని, దీనివల్ల బండ్‌కు ప్రమాదం ఏర్పడే అవకాశం ఉందని దాన్ని ఏటా పూర్తిగా నింపడం లేదు. సముద్ర మట్టానికి అత్యంత ఎత్తులో ఉండే గట్టు మండలానికి సాగునీరు అందించడం కోసం డీకే అరుణ మంత్రిగా ఉన్నప్పటి నుంచీ పలుమార్లు శంకుస్థాపనలు జరిగినా.. ఇప్పుడు పనులు జరుగుతున్నాయి. కానీ నిధుల లేమితో చాలా ఆలస్యమవుతోంది. అలాగే ఆర్డీఎస్ ఆయకట్టుకు ప్రత్యామ్నాయంగా చేపట్టిన తమ్మిళ్ల ఎత్తిపోతల పథకానికి అనుబంధంగా నిర్మించాల్సిన వల్లూరు, జూలకల్, మల్లమ్మకుంట రిజర్వాయర్లు.. పథకం ప్రారంభించి ఐదేళ్లవుతున్నా నిర్మించలేదు. ఎన్నికలకు కొద్దిరోజుల ముందు మల్లమ్మకుంట రిజర్వాయర్‌కు జీవో వచ్చినా.. ఆ పనులు ప్రారంభం కాలేదు. కేవలం డెలివరీ సిస్టర్న్ ద్వారా ఆర్డీఎస్ డిస్ట్రిబ్యూటరీ వద్ద నీరు వదులుతున్నారు. అయితే అక్కడ మూడు పంపులు ఏర్పాటు చేయగా.. డెలవరీ సిస్టర్న్ మాత్రం ఒక్క పంపు నడిస్తే వచ్చే నీరుకు సరిపోయేంతగానే ఉండటం గమనార్హం. దేవాదుల నుంచి మోటార్లు తీసుకువచ్చి బిగించినా.. నేటికీ ఒక్క పంపునే వాడుతున్నారు. భీమా ఫేజ్ 2 కింద కానాయపల్లి, రంగసముద్రం పునరావాస పనులు ఇంకా పూర్తి కాలేదు. దీనివల్ల రిజర్వాయర్లు పూర్తిగా నింపలేక.. లక్ష్యం మేర ఆయకట్టు నేటికీ స్థిరీకరించలేని పరిస్థితి ఉంది. కల్వకుర్తి ఎత్తిపోతల పథకం కింద వరద జలాలు 25 టీఎంసీల నుంచి 40 టీఎంసీలకు పెంచినప్పటికీ.. డెలవరీ సిస్టర్న్, కాలువలు ఆ మేరకు అభివృద్ధి చేయలేదు. వరద వచ్చినప్పుడు నీటిని స్టోర్ చేసుకోవడానికి సరిపడా రిజర్వాయర్లు కూడా లేవు. గత ప్రభుత్వం ప్రధాన కాలువ వెంట ఆన్‌లైన్ రిజర్వాయర్లను నిర్మిస్తామని ప్రకటించినప్పటికీ అది ఆచరణ సాధ్యం కాలేదు. ఇక పాలమూరు-రంగారెడ్డి పథకం మొదటి పంపు వెట్ రన్ ప్రారంభించినప్పటికీ.. మొత్తం పథకంలో ఏ మేర పనులు జరిగాయో తేలాల్సి ఉంది. వీటన్నింటిపై రాబోవు సమీక్ష, పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌లో చర్చ జరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

అన్ని పథకాలపైనా చర్చ..

ఉమ్మడి పాలమూరు జిల్లాలో ఒకప్పుడు ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు ఒక్కటే సాగు, తాగునీరుకు అదెరువుగా ఉండేది. పలు ప్రభుత్వాల్లో ఎత్తిపోతల పథకాలకు శంకుస్థాపనలు జరిగినప్పటికీ.. అవి పనులు ప్రారంభం కాకముందే ప్రభుత్వాలు మారిపోయేవి. అయితే తెలంగాణ ఉద్యమం ఊపందుకోవడం, పాలమూరు కరువు.. ఉద్యమానికి ప్రధాన ఎజెండాగా మారడంతో అప్పటి ఉమ్మడి ప్రభుత్వం 2004 తర్వాత జలయజ్ఞం పేరుతో ఎత్తిపోతల పథకాలకు శ్రీకారం చుట్టింది. ప్రస్తుత గద్వాల జిల్లాకు సాగునీరు ఇవ్వడం కోసం జవహర్ నెట్టెంపాడు ఎత్తిపోతల పథకం, నాగర్‌కర్నూల్ జిల్లా కోసం కల్వకుర్తి ఎత్తిపోతల పథకం, వనపర్తి, నారాయణపేట జిల్లాలకు నీరందించడం కోసం భీమా 1, 2 ఎత్తిపోతల పథకాలను చేపట్టింది. అలాగే కోయిల్‌సాగర్ ఎత్తిపోతల పథకాన్ని కూడా విస్తరించింది. అయితే 2004 నుంచే పనులు ప్రారంభం కాగా.. 2013లో కల్వకుర్తి ఎత్తిపోతల పథకంలో మొదటి పంపును ఎల్లూరు వద్ద అప్పటి సీఎం కిరణ్ కుమార్‌రెడ్డి ప్రారంభించారు. అది బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ కావడంతో అప్పట్లో ఆయకట్టుకు నీరందలేదు. తర్వాత తెలంగాణ ఉద్యమం ఊపందుకోవడం, స్వరాష్ట్రం ఏర్పడటం చకచక జరిగిపోయాయి. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వం పాలమూరు జిల్లా ఎత్తిపోతల పథకాలకు పెండింగ్ ప్రాజెక్టులుగా పేరు పెట్టి.. పనులు పూర్తి చేయాలని సంకల్పించింది. 2016 నుంచి 2018 మధ్య కాలంలో అన్ని ఎత్తిపోతల పథకాల ద్వారా నీరందించడం ప్రారంభమైంది. అయితే ఇప్పటికీ గొలుసుకట్టు చెరువుల వ్యవస్థపై ఆధారపడటమే తప్ప.. ప్రత్యేకంగా ఫీడర్ చానల్ వ్యవస్థ లేదు. ఈ క్రమంలో తామే నీళ్లిచ్చామని బీఆర్ఎస్ ప్రచారం చేసుకుంటుండగా.. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వమే మెజారిటీ పనులు పూర్తి చేసిందని, తామే నీళ్లిచ్చామని బీఆర్ఎస్ చెప్పుకోవడం సరికాదని కాంగ్రెస్ స్పష్టం చేస్తోంది. ఈ నేపథ్యంలో ఆ విషయాలను రూఢీ చేసేందుకే ఇరిగేషన్‌పై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందని స్పష్టమవుతోంది. అదే జరిగితే పాలమూరు జిల్లా రాజకీయం హాట్‌హాట్‌గా మారనుంది.



కల్వకుర్తి ఎత్తిపోతల పథకం(ఫైల్)

రామాలయం చేరిన పంచాయితీ



రామాలయంలో కూర్చున్న వంశీచంద్‌రెడ్డి, ఎమ్మెల్యేలు యెన్నం, శ్రీహరి తదితరులు

- ఎంపీ ఎన్నికల్లో పోటీకి డీకే అరుణ రూ.15 కోట్లు అడిగారన్న అభియోగంపై వంశీచంద్.. డీకే అరుణల మధ్య వార్
- పాలమూరు రామాలయానికి చేరుకున్న వంశీచంద్, ఎమ్మెల్యేలు యెన్నం, శ్రీహరి
- హాజరుకాని డీకే అరుణ
- డబ్బులడిగిన మాట నిజం కాబట్టే హాజరు కాలేదు: వంశీచంద్‌రెడ్డి

మహబూబ్‌నగర్, జనవరి 28: పార్లమెంట్ ఎన్నికలకు ముందు పాలమూరు రాజకీయం వేడెక్కుతోంది. సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు చల్లావంశీచంద్‌రెడ్డి, బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణల మధ్య తలెత్తిన పంచాయితీ ఆదివారం మహబూబ్‌నగర్‌లోని రామాలయానికి చేరుకుంది. 2019 పార్లమెంట్ ఎన్నికల సమయంలో కాంగ్రెస్‌లో ఉన్న డీకే అరుణ పార్టీ నుంచి మహబూబ్‌నగర్ స్థానానికి పోటీ చేయాలని టీపీసీసీ సమావేశంలో కోరగా.. రూ.15 కోట్లు ఇస్తే పోటీ చేస్తానని చెప్పారని, ఆ సమావేశంలో తాను కూడా ఉన్నానని వంశీచంద్‌రెడ్డి ఇటీవల ఆరోపించారు. దీనిపై తాను ఎక్కడైనా సరే రామాలయానికి వచ్చి దేవుడిమీద ప్రమాణం చేస్తానని, లేదంటే రాజకీయ సన్యాసం చేస్తానని సవాల్ విసిరారు. ఈ విషయంపై స్పందించిన డీకే అరుణ టీపీసీసీ సమావేశంలో పలువురు ముఖ్య నాయకుల సమక్షంలో తాను డబ్బులు అడిగానని ఆరోపించారని, ఆరోజు సమావేశంలో పాల్గొన్న ముఖ్య నాయకులంతా వస్తే తాను ఏ రామాలయంలో ప్రమాణం చేయడానికైనా సిద్ధమేనని సవాల్ చేశారు. సవాల్‌ను స్వీకరించిన వంశీచంద్‌రెడ్డి ఆదివారం ఉదయం 11 గంటలకు మహబూబ్‌నగర్ పట్టణంలోని టీచర్స్ కాలనీ రామాలయానికి చేరుకున్నారు. ఆయనతోపాటు మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో వచ్చారు. డీకే అరుణ కోసం దాదాపు గంట పాటు వేచి ఉన్న తరువాత.. ఆమె రావడం లేదని తెలిసి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

తప్పించుకునే ప్రయత్నం

అనంతరం వంశీచంద్‌రెడ్డి మీడియా సమావేశంలో మాట్లాడారు. తాను చేసిన అభియోగానికి ఇప్పటికీ కట్టుబడి ఉన్నానని, దీనిపై ఎన్నిసార్లయినా రాములవారిపై ప్రమాణం చేయడానికి సిద్ధగా ఉన్నానని స్పష్టం చేశారు. సవాల్ విసిరి.. రాకపోవడంతోనే తాను చేసిన అభియోగం నిజమేనని అందరికీ అర్థమైందన్నారు. ఆరోజు టీపీసీసీ సమావేశంలో పాల్గొన్న నాయకులంతా రావాలని కోరడంలో అర్థం లేదన్నారు. ప్రమాణం చేసే దమ్ములేక తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారన్నారు. నిజానికి, ధర్మానికి నిదర్శనం రాములవారని, అందుకే రాములవారి సమక్షంలో మరోసారి తాను చేసిన అభియోగానికి కట్టుబడి ఉన్నానని ప్రమాణం చేసి చెబుతున్నానని అన్నారు. సమావేశంలో నాయకులు వినోద్‌కుమార్, హర్షవర్ధన్‌రెడ్డి, ఎన్‌పీ వెంకటేశ్, ఎం.సురేందర్‌రెడ్డి, ఆనంద్‌కుమార్‌గౌడ్, సిరాజ్‌ఖాద్రి, సీజే బెనహర్, లక్ష్మణ్ యాదవ్, సాయిబాబ, బెక్కరి అనిత, చంద్రకుమార్‌గౌడ్, అవేజ్ పాల్గొన్నారు.



ఆలయాన్ని శుభ్రం చేస్తున్న బీజేపీ, బీజేవైఎం నాయకులు

రామాలయాన్ని శుద్ధి చేసిన నాయకులు

మహబూబ్‌నగర్(క్లాక్ టవర్): బీజేపీ, బీజేవైఎం ఆధ్వర్యంలో పాలమూరు పట్టణంలోని టీచర్స్ కాలనీ రామాలయాన్ని ఆదివారం శుద్ధి చేశారు. వంశీచంద్ రెడ్డి, డీకే అరుణల మధ్య సవాళ్లు, ప్రతి సవాళ్ల నేపథ్యంలో వంశీచంద్‌రెడ్డి, ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్ రెడ్డి, శ్రీహరి, నాయకులు ఉదయం మహబూబ్‌నగర్‌లోని టీచర్స్ కాలనీ రామాలయానికి వచ్చారు. డీకే అరుణ కోసం కొంత సేపు వేచి చూశారు. ఆమె రాకపోవడంతో వెళ్లిపోయారు. అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠను బహిష్కరించిన కాంగ్రెస్ నాయకులు రాముడి గుడికి రావడాన్ని నాయకులు తప్పు పట్టారు. ఈ సందర్భంగా గుడి ప్రాంగణాన్ని నీటితో శుభ్రం చేశారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జి.పద్మజా రెడ్డి, జిల్లా అధ్యక్షుడు పి.శ్రీనివాస్ రెడ్డి, యువమోర్చా జిల్లా అధ్యక్షుడు కిరణ్‌కుమార్ రెడ్డి, మహిళామోర్చా జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పద్మవేణి, సాహితీ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఒత్తిడిని జయిస్తే.. పదిలో విజయం

- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పదో తరగతి పరీక్షలు రాయనున్న 58 వేల మంది విద్యార్థులు
- బట్టీ పట్టకుండా అవగాహన చేసుకుని చదవాలి
- కార్బొహైడ్రేట్స్ ఉన్న ఆహారం, పండ్లు ఎక్కువ తీసుకుంటే మంచిది
- 'ఆంధ్రజ్యోతి'తో సీనియర్ ఉపాధ్యాయులు, డాక్టర్లు, నిపుణులు





ధర్మాపూర్ పాఠశాలలో ప్రత్యేక తరగతులకు హాజరైన విద్యార్థులు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, జనవరి 28: ప్రణాళికతో చదివితే పదో తరగతి పరీక్షల్లో మంచి ఫలితాలు వస్తాయని చెబుతున్నారు నిపుణులు. మార్చి 18వ తేదీ నుంచి పది పరీక్షలు ప్రారంభం కానున్నాయి. పరీక్షలు అంటేనే విద్యార్థుల్లో భయం ఉంటుంది. ఎగ్జామ్స్ దగ్గరపడుతుండటంతో స్టూడెంట్స్‌ను సన్నద్ధం చేయడం ఉపాధ్యాయులకు, విద్యార్థుల తల్లిదండ్రులకు కత్తిమీద సామే. ఈ 48 రోజులు.. ఒత్తిడికి దూరంగా, ప్రణాళిక, ఆత్మవిశ్వాసంతో ముందుకెళ్తే అనుకున్న లక్ష్యాన్ని సాధించగలుగుతారని అంటున్నారు. ఈ నేపథ్యంలో విద్యార్థులు ఎలా చదవాలి?, తీసుకోవాల్సిన జాగ్రత్తలేంటి?, ఆహారపు అలవాట్లు ఎలా ఉండాలనే విషయాలపై పలువురు నిపుణులు, విద్యాశాఖ అధికారులు, సీనియర్ ఉపాధ్యాయులతో 'ఆంధ్రజ్యోతి' మాట్లాడింది. వారి విలువైన సూచనలు, సలహాలు మీ కోసం..

ఉపాధ్యాయుల ప్రత్యేక దృష్టి

ఉమ్మడి పాలమూరు జిల్లాలో 58 వేల మందికిపైగా విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాసేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే సిలబస్ పూర్తయ్యింది. అన్ని స్కూల్స్‌లో రివిజన్ తరగతులు కొనసాగుతున్నాయి. మాడల్ పరీక్ష పేపర్లు, గతంలో నిర్వహించిన పరీక్షల ప్రశ్నపత్రాలను విద్యార్థులకు సబ్జెక్టు ఉపాధ్యాయులు వివరిస్తున్నారు. అనుమానాలను తీరుస్తున్నారు. ప్రభుత్వ, జిల్లా పరిషత్, గురుకుల, కేజీబీవీ, ప్రైవేట్ పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించారు.

కొనసాగుతున్న ప్రత్యేక తరగతులు

పదో తరగతిలో వంద శాతం ఫలితాలు సాధించాలన్న లక్ష్యంతో విద్యాశాఖ ప్రత్యేక దృష్టి సారించింది. మహబూబ్‌నగర్ ముఖ్యమంత్రి సొంత జిల్లా కావడంతో గతం కంటే మంచి ఫలితాలు సాధించాలని విద్యాశాఖ అధికారులు చర్యలు చేపట్టారు. నిత్యం ప్రభుత్వ పాఠశాలలను పర్యవేక్షిస్తున్నారు. ఎస్‌ఏ-1, ఎస్‌ఏ-2 పరీక్షల ఫలితాలపై ఆరా తీస్తున్నారు. వెనుకబడిన విద్యార్థులను ఉపాధ్యాయులు దత్తత తీసుకుని చదివించాలని భావిస్తున్నారు. గత నవంబరు నుంచే పాఠశాలల్లో ఉదయం, సాయంత్రం గంట పాటు ప్రత్యేక తరగతులు తీసుకుంటున్నారు. ప్రతీ శుక్రవారం విద్యార్థులకు వారంతపు పరీక్షలు నిర్వహిస్తున్నారు. మహబూబ్‌నగర్ జిల్లా విద్యాశాఖ అధికారి రవీందర్ పాఠశాలలను పర్యవేక్షిస్తున్నారు.

ఇవీ తప్పని సరిగా గుర్తుంచుకోవాలి

- విద్యార్థులు తెల్లవారుజామున ఐదు గంటలకు లేచి చదువుకోవాలి.
- సబ్జెక్టులోని కీలక అంశాలను ఎప్పటికప్పుడు రాస్తుండాలి.
- పాఠ్యాంశాలను బట్టీ పట్టకుండా అర్థం చేసుకుని చదవాలి.
- ఎప్పుడూ ఒకే సబ్జెక్టు కాకుండా.. మారుస్తూ చదవడం వల్ల విద్యార్థులకు బోర్ అనిపించదు. ఒత్తిడి తగ్గుతుంది.
- పరీక్షల సమయంలో టీవీ, కంప్యూటర్, సెల్‌ఫోన్‌లకు దూరంగా ఉండటం వలన మనస్సు చదువుపైనే నిమగ్నం చేయొచ్చు.

ఒత్తిడికి దూరంగా ఉండేలా అవగాహన

విద్యార్థులు పరీక్షల్లో ఒత్తిడికి లోనుకాకుండా ఉండటంతోపాటు భవిష్యత్తులో రాణించేలా విద్యార్థులకు సీనియర్ ఉపాధ్యాయులు, నిపుణులతో కెరీర్ గైడెన్స్ ఇప్పిస్తున్నారు. ఇంటి వద్ద పిల్లలు పరీక్షలకు ఎలా సిద్ధం చేయాలన్న విషయమై వివరిస్తున్నారు. విద్యార్థులు చదువుకుంటున్నారని తెలియడానికి రోజూ తెల్లవారుజామున ఐదు గంటలకు విద్యార్థులే దత్తత తీసుకున్న ఉపాధ్యాయలకు మిస్‌కాల్ ఇవ్వాలని విద్యాశాఖ సూచించింది.

ఏకాగ్రతతో చదవాలి



పదో తరగతి పరీక్షలు విద్యార్థులకు జీవితంలో తొలి మెట్టులాంటివి. ఒత్తిడికి గురికాకుండా ముఖ్యమైన అంశాలపై దృష్టిపెట్టాలి. చదువుకునే సమయంలో ప్రతీ గంటకోసారి కనీసం పది నిమిషాలు విశ్రాంతి తీసుకోవాలి. కార్బొహైడ్రేట్స్ ఎక్కువ ఉండే ఆహారం తీసుకోవాలి. దీంతో తక్షణ శక్తి లభిస్తుంది. సకాలంలో భోజనం చేయాలి. పండ్లు తీసుకుంటే మంచింది. ఆకు కూరలు, పప్పుదినుసులు తీసుకోవాలి. ఉదయం, సాయంత్రం పది నిమిషాలు మెడిటేషన్ చెయ్యాలి. దీంతో జ్ఞాపకశక్తి పెరుగుతుంది. చదువుతున్నామని నిద్రపోవడం మానేస్తే అనారోగ్యానికి గురవుతారు. తప్పని సరిగా ఎనిమిది గంటలు నిద్రపోవాలి.

– డాక్టర్ మహేష్‌బాబు, గుండె వైద్య ప్రముఖ నిపుణుడు

ఒత్తిడికి లోనుకావొద్దు



పరీక్షల సమయం సమీపిస్తున్నకొద్దీ విద్యార్థులు ఆందోళన, మానసిక ఒత్తిడికి లోను అవుతుంటారు. మంచి మార్కులు వస్తాయో రావోనని కొందరు బెంగపడుతుంటారు. పాస్ అవుతామా? లేదా? అన్న భావన మానసిక ఒత్తిడికి గురి చేస్తుంది. అలా అయితే చదివింది కూడా బాగా రాయలేరు. ఒత్తిడి లేకుండా ప్రశాంతంగా ఉండాలి. సరిపోయేంత నిద్ర పోవాలి. అప్పుడే మెదడు బాగా పని చేస్తుంది. పరీక్షలు బాగా రాయగలుగుతారు.

– వంగీపురం శ్రీనాథాచారి, వ్యక్తిత్వ వికాస సీనియర్ నిపుణులు

వంద శాతం ఫలితాలే లక్ష్యం



పదో తరగతి పరీక్షల్లో వంద శాతం ఫలితాలు సాధించాలన్న లక్ష్యంతో విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. జిల్లాలోని ప్రతి ప్రభుత్వ పాఠశాలలను పర్యవేక్షిస్తున్నాను. ఉపాధ్యాయులతో మాట్లాడుతున్నాను. ఇప్పటికే పదో తరగతి సిలబస్ పూర్తయ్యింది. రివిజన్ తరగతులు నిర్వహిస్తున్నారు. వారాంతపు పరీక్షలు పెడుతున్నారు. విద్యార్థులకు సాయంత్రం అల్పాహారం అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం.

– ఎ.రవీందర్, డీఈవో, మహబూబ్‌నగర్

సంఘ సంస్కర్త సుబ్బయ్య

- ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్ రెడ్డి
- పాలెంలో ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి

బిజినేపల్లి, జనవరి 28: నాగర్‌కర్నూల్ జిల్లా పాలెంలో 60 ఏండ్ల క్రితం గుడి, బడి స్థాపించి.. ఒక పక్క ఆధ్యాత్మిక భావన, మరోపక్క విజ్ఞానాన్ని అందించి.. సమాజాన్ని సంస్కరించిన గొప్ప సంఘ సంస్కర్త తోటపల్లి సుబ్బయ్య అని నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్ రెడ్డి అన్నారు. పాలెం ప్రభుత్వ ఎస్వీ డిగ్రీ కళాశాల ఆవరణలో పాలెం విద్యా సంస్థల వజ్రోత్సవాలను పూర్వ విద్యార్థులు ఆదివారం నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్ రెడ్డి మాట్లాడుతూ ఎలాంటి లాభాపేక్ష లేకుండా విద్యాదానం చేసి, వేలాది కుటుంబాల్లో వెలుగులు నింపిన సుబ్బయ్య మహనీయుడని కొనియాడారు. విద్యతో పాటు ఈప్రాంత ప్రజలకు ఉపాధి కోసం పరిశ్రమలను స్థాపించారన్నారు. సుబ్బయ్యను ఆదర్శంగా తీసుకొని నియోజకవర్గ అభివృద్ధికి పాటుపడుతానని అన్నారు. సమ్మేళనం అద్యతం సుబ్బయ్య నామస్మరణతో పులకించింది. సుబ్రమణ్యం శర్మ స్థాపించిన విద్యా సంస్థల్లో విద్యాభ్యాసం చేసిన పూర్వ విద్యార్థులు వజ్రోత్సవాలకు వేలాదిగా తరలి రావడంలో వైభవంగా జరిగింది. 1963 నుంచి 2023 వరకు చదువుకున్న పూర్వ విద్యార్థులు దశాబ్దాల తర్వాత కలుసుకోవడంతో ఆప్యాయంగా పలుకరించుకున్నారు. నాటి గురువులు మాట్లాడుతూ అప్పటి స్మృతులను, విద్యార్థుల చిలిపి చేష్టలను గుర్తు చేసుకున్నారు. పలువురు పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ ఒక పూట తినడానికి కూడా లేని నిరుపేద కుటుంబాల్లో పుట్టి, సుబ్బయ్య స్థాపించిన హాస్టల్‌లో ఉండి చదువుకొని ఉన్నత స్థానాలకు ఎదిగామన్నారు. సుబ్బయ్య గారే నిజమైన దేవుడని, ఆయన సేవలను కొనియాడారు. అలాగే సుబ్బయ్య స్థాపించిన విద్యా సంస్థల పూర్వ వైభవానికి తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని అన్నారు. వజ్రోత్సవాల నిర్వహణకు అహర్నిషలూ కృషి చేసిన పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు బుడ్డయ్య, కార్యదర్శి మోహన్‌బాబు, చీఫ్ వలంటీర్లు ఎంపీపీ శ్రీనివాస్ గౌడ్, అనుపటి లక్ష్మికాంత్, డాక్టర్ అనుపటి మల్లికార్జున్, కాశిరెడ్డి గోపాల్ రెడ్డి, వస్పరి శివుడు, గోపాల స్వామి, శ్రీనివాస్‌రెడ్డిలకు పూర్వ విద్యార్థులంతా ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు నెడనూరి దిలీపాచారి, రుక్మారెడ్డి, కాశమోని వెంకటయ్య, నారదాసు మహేష్, డేగ శేఖర్, లక్ష్మయ్య, పృథ్వీరాజు, రామకృష్ణ, శ్రీధర్, కిషోర్, బంగారయ్య తదితరులు ఉన్నారు.



ప్రసంగిస్తున్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

రాజ్యాధికారమే లక్ష్యంగా..

- బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

ఇటిక్యాల, జనవరి 28: రాజ్యాధికారమే అంతిమ లక్ష్యంగా భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్.అంబేద్కర్ ఎన్నో పోరాటాలను చేసి మన కోసం ఆయన జీవితాన్నే పణంగా పెట్టారని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఆర్ఎస్. ప్రవీణ్‌కుమార్ అన్నారు. జోగుళాంబ గద్వాల జిల్లా ఇటిక్యాల మండలం సాతర్ల గ్రామంలో ఆదివారం అంబేద్కర్ విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో బహుజన వాదం బలమైన శక్తిగా మారి, ఉద్యమిస్తేనే బహుజనులకు రాజ్యాధికారం దక్కుతుందన్నారు. పృథ్వీరాజ్ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు కేశవరావు, అతీఖుర్ రహిమాన్, సర్పంచుల సంఘం అధ్యక్షుడు జయచంద్రారెడ్డి, పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి దినపత్రికలో...
ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్) కొరకు ఈ క్రింది నెంబర్లకు సంప్రదించగలరు.
మహబూబ్‌నగర్ : 9985411175, 9985403259
నాగర్‌కర్నూల్ : 9985410905
కల్వకుర్తి : 9985403252
వనపర్తి : 9985403242
గద్వాల : 9985403238
నారాయణపేట : 9985411463
మరిన్ని వివరాలకు సంప్రదించండి
9985411365

విద్యుదాఘాతంతో గుడిసె దగ్ధం



దగ్ధమైన గుడిసె

హన్వాడ, జనవరి 28 : విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో పూరిల్లు పూర్తిగా దగ్ధమైన సంఘటన మండలంలోని గొండ్యాల గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం గొండ్యాల గ్రామానికి చెందిన సత్యయ్య ఇంట్లో విద్యుత్ వైర్లు షార్ట్‌సర్క్యూట్‌కు గురికావడంతో మంటలు చెలరేగాయి. చుట్టు పక్కల వారు వచ్చేలోపు ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. కుటుంబ పెద్దలు పొలానికి వెళ్లడంతో ఇంటి దగ్గర ఉన్న కూతురు బయట బట్టలు ఉతుకుతుండగా ఈ ప్రమాదం జరిగినట్లు స్థానికులు తెలిపారు. బియ్యం, పప్పు, వంట సామనులు, భూమి పట్టా పాసుపుస్తకం, డబ్బులు ఇతర వస్తువులు మొత్తం కాలిపోయినట్లు స్థానికులు తెలిపారు. ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ఫిబ్రవరి 2న బ్రహ్మాండమైన విడుదల



శాంతి 70 ఎంఎం - నారాయణగూడ

మెగా 70ఎంఎం ఎ/సి - దిల్‌సుఖ్‌నగర్

SUPER HIT నేడే చూడండి



సంధ్య 35 - ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్ 11.00,2.00,6.00,9.00

Enjoy 4k Laser Projection & Dolby Atmos Sound

శ్రీలక్ష్మి 2.30pm


GLOBAL CINEMAS LLP

ఫిబ్రవరి 2న బ్రహ్మాండమైన విడుదల



శాంతి 70 ఎంఎం - నారాయణగూడ

ఫిబ్రవరి 2న బ్రహ్మాండమైన విడుదల



దేవి 70 ఎ/సి - ఆర్.టి.సి.క్రాస్‌రోడ్స్

ENJOY 4K LASER PROJECTION & DOLBY ATMOS SOUND

ఫిబ్రవరి 2న బ్రహ్మాండమైన విడుదల



SRI LAKSHMI GAYATRI FILMS 9391176659

ఫిబ్రవరి 2న బ్రహ్మాండమైన విడుదల



SKML MOTION PICTURES 9299992173


ఫిబ్రవరి 2న బ్రహ్మాండమైన విడుదల



లక్ష్మీకళ సినీప్లెక్స్ - మూసాపేట్ | విజయలక్ష్మి - ఎల్.బి.నగర్ | మహాలక్ష్మి 70ఎంఎం ఎ/సి - కొత్తపేట

GANESH BHARI 9296509333

BLOCKBUSTER విజయవంతమైన 3వ వారం



సుదర్శన్ 35 ఎంఎం - ఆర్.టి.సి.క్రాస్‌రోడ్స్ 11.00,2.30,6.00,9.30

Enjoy 4k Laser Projection & Dolby Atmos Sound

SANKRANTI KING విజయవంతమైన 3వ వారం



దేవి 70ఎంఎం ఎ/సి - ఆర్.టి.సి.క్రాస్‌రోడ్స్ 11.00,2.40,6.00,9.30

ENJOY 4K LASER PROJECTION & DOLBY ATMOS SOUND



సప్తగిరి 70ఎంఎం ఎ/సి - ఆర్.టి.సి. క్రాస్‌రోడ్స్ | సంధ్య 70ఎంఎం ఎ/సి - ఆర్.టి.సి. క్రాస్‌రోడ్స్

తగ్గించిన టికెట్టు ధరలలో : అంజలి 70ఎంఎం - సికింద్రాబాద్ | కుమార్ 70 ఎంఎం ఎ/సి - కాచిగూడ | విమల్ 70ఎంఎం ఎ/సి - బాలానగర్

మహబూబ్‌నగర్ పార్లమెంట్‌కు కాంగ్రెస్ అధికార ప్రతినిధుల కేటాయింపు


జహీర్ అక్తర్


కాల్వ సుజాత

మహబూబ్‌నగర్, జనవరి 28 : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మహబూబ్‌నగర్ పార్లమెంట్ నియోజకవర్గానికి కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధులను నియమించింది. ఈ మేరకు ఆదివారం టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్‌గౌడ్ ఉత్తర్వులు జారీ చేశారు. సీనియర్ నాయకులు జహీర్‌అక్తర్, వికారాబాద్ జిల్లాకు చెందిన కాల్వ సుజాతలను నియమించారు. పార్లమెంట్ ఎన్నికలు ముగిసేవరకు ఆయా పార్లమెంట్ పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన వివిధ సమస్యలపై ఆ ప్రాంత నాయకులతో కలిసి పని చేయాలని, పత్రికా సమావేశాలు ఏర్పాటు చేయాలని పార్టీ ఆదేశించినట్లు నాయకులు తెలిపారు.

కేంద్ర ఫిలిం సెన్సార్‌బోర్డు సభ్యురాలికి సన్మానం


పి.అంజమ్మను సన్మానిస్తున్న మాలమహానాడు ప్రతినిధులు

పాలమూరు, జనవరి 28 : కేంద్ర ఫిలిం సెన్సార్ బోర్డు సభ్యురాలు పి.అంజమ్మను ఆదివారం జిల్లా కేంద్రంలోని ఆమె నివాసంలో మాలమహానాడు ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు కాడం బాలరాజు, రాష్ట్ర అధికార ప్రతినిధి ఎడ్ల కృష్ణయ్య, మిట్టమీది బాలరాజు, కానుగడ్డ యాదయ్య, డబ్బా రాములు, బి.శ్రీనివాసులు, జి.చెన్నయ్య, పి.బి.శ్రీనివాసులు, పి.చెన్నప్ప, ఎస్.వెంకట్రాములు, ఎం.నాగరాజు పాల్గొన్నారు.

మాజీ సర్పంచుకు నివాళి


బలీద్‌పల్లిలో నివాళి అర్పిస్తున్న చిన్నారెడ్డి

అడ్డాకుల, జనవరి 28 : మండల పరిధిలోని బలీద్‌పల్లికి చెందిన సీనియర్ నాయకుడు, మాజీ సర్పంచు నరసింహారెడ్డి ఆదివారం బ్రెయిన్‌స్ట్రోక్‌తో చనిపోడంతో ఏఐసీసీ కార్యదర్శి, ప్రదేశ్ కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ చైర్మన్ చిన్నారెడ్డి, బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీలకు చెందిన పలువురు నాయకులు మృతదేహానికి నివాళి అర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. అదే విధంగా మూసాపేట మండల పరిధిలోని కొమిరెడ్డిపల్లిలో కొంగరి వెంకటమ్మ మరణించడంతో మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి మృతదేహానికి నివాళి అర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. బలీద్‌పల్లిలో పరామర్శించిన వారిలో డీసీసీ కార్యదర్శి జి.విజమోహన్‌రెడ్డి, రాములు, బాలయ్య, భీమన్న యాదవ్ ఉన్నారు.

గద్వాలలో ఒక ఇంట్లో చోరీ.. మరో ఇంట్లో యత్నం


చోరీ జరిగిన ఇంట్లో చిందరవందరంగా పడిన వస్తువులు

గద్వాల క్రైం, జనవరి 28: గద్వాల పట్టణంలోని పాత హౌసింగ్ బోర్డు కాలనీలో శనివారం రాత్రి ఓ ఇంట్లో చోరీ, మరో ఇంటిలో చోరీ యత్నం జరిగినట్లు పోలీసులు ఆదివారం తెలిపారు. ఇందుకు సంబంధించిన పట్టణ పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గద్వాల పట్టణంలోని పాత హౌసింగ్ బోర్డులో నివాసం ఉంటున్న శ్రీనివాస శాస్త్రీ శనివారం హైదరాబాద్‌కు వెళ్లి ఆదివారం వచ్చేలోపు ఇంట్లో ఉన్న మూడున్నర తులాల బంగారం, అరకిలో వెండితో పాటు కొంత నగదు పోయినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అలాగే అదే కాలనీలో ఉంటున్న రమణ కుటుంబ సభ్యులు ఊరికి వెళ్లడంతో ఇంట్లో దొంగతన యత్నం చేయగా తాళాలు రాకపోవటంతో దొంగలు అక్కడి నుంచి వెళ్లిపోయినట్లు తెలిపారు. దీంతో బాధితుల ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి విచారిస్తున్నట్లు పట్టణ ఎస్‌ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి


మృతి చెందిన మనోహర్ రెడ్డి (ఫైల్)

ఉండవల్లి, జనవరి 28: ఉండవల్లి మండల కేంద్రానికి చెందిన యువకుడు చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు ఎస్సై బాలరాజు తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రానికి చెందిన దుంపల మనోహర్‌రెడ్డి(33) మల్టీమీడియా కోర్సు పూర్తి చేసి ఉద్యోగం రాక ఇంటి దగ్గరే ఉండేవాడు. కొన్ని నెలలుగా మద్యానికి బానిసయ్యాడు. తన తండ్రితో నిత్యం డబ్బు కోసం వాదించేవాడని, శనివారం సాయంత్రం తండ్రిని డబ్బులు అడగక లేవని నిరాకరించి బయటకు వెళ్లాడు. కోపోద్రిక్తుడైన మనోహర్ రెడ్డి ఇంట్లో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడగా గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారు జామున మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. మృతుని తండ్రి దుంపల మద్దిలేటి రెడ్డి అలియాస్ పెద్దబాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రేకుల చౌడాపూర్ గ్రామంలో..

నవాబ్‌పేట: తాగిన మైకంలో భార్యతో గొడవపడిన భర్త పురుగు మందుతాగి చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. ఏఎస్‌ఐ సురేష్ బాబు కథనం ప్రకారం వివ రాలు ఇలా ఉన్నాయి. మండలంలోని రేకుల చౌడాపూర్ గ్రామానికి చెందిన కుమ్మరి నర్సిం హులు(48) కొంత కాలంగా తాగుడుకు బానిసయ్యాడు. ఈనెల 20న భార్య లక్ష్మమ్మతో గొడవపడి రాత్రి 8 గంటల సమయంలో గ్రామ సమీపంలో ఉన్న సత్యంగౌడ్ వ్యవసాయ పొలంలో కొట్టుమిట్టాడుతుండగా గుర్తించిన గ్రామస్థులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. అందరూ కలిసి 108లో జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా అక్కడి నుంచి హైదరాబాద్‌లోని గాంధీకి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న ఏఎస్‌ఐ తెలిపారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని ఇద్దరి మృతి

- తిమ్మాజిపేట మండలం మరికల్ వద్ద ఘటన


మృతి చెందిన హర్షవర్ధన్‌గౌడ్, చందుగౌడ్

తిమ్మాజిపేట, జనవరి 28 : నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజిపేట మండలం మరికల్ వద్ద రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యు వకులు మృతి చెందారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరా ల ప్రకారం... ఆదివారం రాత్రి తిమ్మాజిపేట మండలంలోని మ రికల్ గ్రామ సమీపంలోని స్వాగతం కమాన్ వద్ద ఆర్టీసీ బస్సు ఢీకొని ఇద్దరు యువకులు దుర్మరణం చెందారు. మహబూబ్ నగర్ జిల్లా జడ్చర్ల మండలం చర్లపల్లికి చెందిన హర్షవర్ధన్‌గౌడ్ (20), చంద్రశేఖర్ అలియాస్ చందుగౌడ్ (23)లు ఓ వ్యక్తిని మ రికల్ గ్రామంలో దింపడానికి బైక్‌పై వచ్చి తిరిగి వెళ్తుండగా గ్రా మ సమీపాన ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొన్నది. ఈ సంఘటనలో తీవ్రంగా గాయపడిన వారిని జడ్చర్లలోని ఓ ప్రైవే ట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందారు. తిమ్మాజిపేట పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పంచ నామా నిర్వహించారు.

ఎంపీగా పోటీ చేసేందుకు అవకాశం కల్పించాలి

- సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితులు వంశీచంద్‌కు వినోద్‌కుమార్ వినతి

మహబూబ్‌నగర్, జనవరి 28 : నాగర్‌కర్నూల్ పార్లమెంట్ స్థానానికి ఎంపీగా తనకు టికెట్ ఇచ్చే విషయాన్ని పరిశీలించాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వినోద్‌కుమార్ కోరారు. ఈ మేరకు ఆదివారం జిల్లా కేంద్రంలో వంశీచంద్‌కు వినతి పత్రం అందజేశారు. ఎస్సీ రిజర్వ్ స్థానమైన నాగర్‌కర్నూల్ టికెట్‌ను బలమైన ఎస్సీ మాదిగ తెగకు చెందిన తనకు అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. 34 ఏళ్లపాటు తాను కాంగ్రెస్ పార్టీలో క్రియాశీలకంగా పనిచేస్తున్నానని, విద్యార్థి దశనుంచే రాజీవ్‌గాంధీని స్ఫూర్తిగా తీసుకుని కాంగ్రెస్ భావజాలాన్ని పుణికిపుచ్చుకున్నామని తెలిపారు. పార్టీలో ఎన్‌ఎస్‌యూఐ, యూత్ కాంగ్రెస్‌లో పనిచేశామని, ప్రస్తుతం టీపీసీసీ ప్రధాన కార్యదర్శిగా పని చేస్తున్నానని అందులో పేర్కొన్నారు. పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోనే తన సొంతూరు అయిజ మండలం చిన్నతాండ్రపాడు ఉందని, ఉమ్మడి పాలమూరు జిల్లాలోని రాజకీయాలపై పూర్తి అవగాహన ఉన్న తన సేవలకు గుర్తింపుగా పార్టీ టికెట్ కోసం సహకరించాలని విన్నవించారు.


వంశీచంద్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వినోద్‌కుమార్

బీజేపీ విధానాలతో పెరిగిన నిరుద్యోగం

- సీఐటీయూ రాష్ట్ర కోశాధికారి వంగూరు రాములు

పాలమూరు, జనవరి 28 : పదేళ్లలో బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న తీరుతో దేశంలో 50శాతం నిరుద్యోగం పెరిగిందని సీఐటీయూ రాష్ట్ర కోశాధికారి వంగూరు రాములు ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఇండస్ట్రియల్‌లో భవన నిర్మాణ కార్మిక సంఘం కార్యాలయంలో ఆల్ ట్రేడ్ యూనియన్ల, రైతు వ్యవసాయ కార్మిక సంఘాల ఉమ్మడి జిల్లా సదస్సు దీప్లానాయక్ అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన బీజేపీ విధానాలతో దేశానికి పూడ్చలేని నష్టం జరిందన్నారు. 20శాతం కార్మికుల వేతనాలు పడిపోయాయన్నారు. దేశంలో అభద్రత విలయ తాండవం చేస్తోందన్నారు. రైతాంగ వ్యవసాయ కూలీల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. కార్పొరేట్ మతోన్మాద విధానాలను ముందుకు తీసుకువెళ్తూ పేదలు కష్టజీవులు, కార్మికులకు నిర్లక్ష్యం చేసిందన్నారు. దేశసంపదను పెద్దపెట్టుబడిదారులకు దోచిపెట్టిందన్నారు. ప్రభుత్వరంగ సంస్థలు, సహజ వనరులను కార్పొరేట్లకు అప్పనంగా కట్టబెట్టిందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల్లో వందశాతం వాటాలను తెగనమ్ముతోందని, రాజ్యాంగాన్ని నిర్వీర్యం చేసిందన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి నల్లవెల్లి కురుమూర్తి, కిల్లెగోపాల్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మాకం రాంమోహన్, ఐఎన్‌టీయూసీ నాయకులు శ్రీనివాసులు, టీఎస్‌టీయూసీ నాయకులు ధన్వాడ రాములు, కె.మోహన్, రైతుసంఘం లక్ష్మయ్య, బీఓసీ అధ్యక్షులు గోనెల రాములు, వరదగాలెన్న, ఆనంద్, ఎర్ర శ్రీనివాసులు ప్రసంగించారు.


ఉమ్మడి జిల్లా సదస్సులో మాట్లాడుతున్న వంగూరు రాములు

మహిళను బెదిరించి పుస్తెల గొలుసు చోరీ

కోడేరు, జనవరి 28: మహిళను బెదిరించి మెడలో ఉన్న మూడు తులాల బంగారు పుస్తెలగొలుసు గుర్తు తెలియని వ్యక్తులు లాక్కెళ్లిన సంఘటన ఆదివారం నాగర్‌కర్నూల్ జిల్లా కోడేరు మండలంలోని తీగలపల్లిలో చోటు చేసుకొంది. ఎస్‌ఐ వి.శేఖర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని తీగలపల్లి గ్రామ సమీపంలో విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలోని కల్వర్టు వద్ద కన్నేరెడ్డి పుష్పావతి తమ పొలంలో వ్యవసాయ పనులు పూర్తి చేసుకొని ఇంటికి వస్తున్నది. ఈ సమయంలో తీగలపల్లి నుంచి వనపర్తి వైపు బైక్‌పై వచ్చిన గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు పుష్పావతిని కత్తితో బెదిరించి మెడలోని బంగారు పుస్తెల గొలుసును లాక్కెళ్లారు. దీంతో ఆమె భయంతో కేకలు వేసి ఇంటికి వచ్చి విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలియజేసింది. కుటుంబ సభ్యులతో పాటు స్థానికులు సంఘటన స్థలానికి వెళ్లి గాలించినా వారు కనిపించకపోవడంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఎస్‌ఐ వి. శేఖర్‌రెడ్డి తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ వి. శేఖర్‌రెడ్డి తెలిపారు.

వివాహిత అదృశ్యం

- కేసు నమోదు

జడ్చర్ల, జనవరి 28 : జడ్చర్ల మండల పరిధిలోని ఓ గ్రామానికి చెందిన వివాహిత కనిపించడంలేదంటూ ఆమె భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నాగరాజు తెలిపారు. ఈ నెల 20న కుటుంబ సభ్యులతో కలిసి ఇంట్లో నిద్రించారని, 21న తెల్లవారుజామున ఉదయం 5గంటల ప్రాంతంలో నిద్రనుంచి మేలుకవచ్చిన అనంతరం చూడగా తన భార్య కనిపించలేదని భర్త ఫిర్యాదులో పేర్కొన్నారు. అప్పటి నుంచి ఆమె వెతికినా ఆచూకీ లభ్యం కాకపోవడంతో ఫిర్యాదు చేశాడని, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపడ్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఎవరికి లాభం చేకూరింది?

- బోర్డులకే పరిమితమైన కీడా ప్రాంగణం - ప్రజాధనాన్ని వృథా చేశారనే ఆరోపణలు


స్వామి భూమిలో ఏర్పాటు చేసి సెగ్రిగేషన్ షెడ్, ప్రకృతి వనం

మానవపాడు, జనవరి 28: గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పల్లెప్రకృతి వనలు, సెగ్రిగేషన్‌షెడ్, డంపింగ్ యార్డు, క్రీడా ప్రాంగణాలు ఎవరికి లాభాన్ని చేకూర్చాయని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. మండలంలోని గోకులపాడు గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయానికి సంబంధించిన భూమి సర్వేనెంబరు 13లో డంపింగ్ యార్డు, సెగ్రిగేషన్ షెడ్, పల్లె ప్రకృతివనం పేరట మొక్కలు నాటారు. ఇందుకు రూ. లక్షల నిధులు ఖర్చుచేశారు. నాటి నుంచి నేటి వరకు అధికారుల పర్యవేక్షణ లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం చేపట్టే నిర్మాణాలు దేవాలయం భూముల్లో ఏవిధంగా చేపట్టారని, ఇందుకు రెవెన్యూ అధికారు లు ఏవిధంగా అనుమతిలిచ్చారని ప్రశ్నిస్తున్నారు. గ్రామానికి అందుబాటులో ఉంటే ప్రజల వినియోగానికి వీలుఉండేదని, శివారులో ఏర్పాటు చేయడం కేవలం ప్రజాధనాన్ని కాసులు మార్చుకునేందుకేనని మండిపడుతున్నారు. అదేవిధంగా పాఠశాల ఆవరణలో క్రీడాప్రాంగణం అని బోర్డు, రెండు వాలీబాల్ పోల్స్ ఏర్పాటు బిల్లులు దండుకున్నరని ఆరోపిస్తున్నారు. ఇందులో అధికారుల పాత్ర ఉండటంతో విచ్చలవిడిగా ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారని గ్రామస్థులు మండిపడుతున్నారు. ఈ విషయమై ఎంపీడీవో రమణరావును ఆంధ్రజ్యోతి వివరణ కోరగా దేవాలయభూమిలో నిర్మాణాలకు ఏవిధంగా అనుమతులిచ్చారో పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.



బోర్డుకే పరిమితం అయిన క్రీడా ప్రాంగణం

ఆర్టీసీ బస్సును ఢీకొన్న కంటైనర్

- ప్రయాణికులకు గాయాలు
- 44 జాతీయ రహదారిపై మూడు కిలో మీటర్ల మేర ట్రాఫిక్ జామ్


జాతీయ రహదారిపై బస్సును ఢీకొన్న కంటైనర్

ఎర్రవల్లి, జనవరి 28: ఆర్టీసీ బస్సును కంటైనర్ ఢీకొన్నది. ఈ ఘటన గద్వాల జిల్లా మానవపాడు మండలంలోని నారాయణపురం స్టేజీ సమీపంలో ఆదివారం రాత్రి చోటు చేసుకున్నది. బస్సులోని ప్రయాణికులకు గాయాలైయ్యాయి. ఇందుకు సంబంధించి హైవే సిబ్బంది, పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. కర్నూలు నుంచి హైదరాబాద్ వెళ్తున్న కంటైనర్ ఒక్కసారిగా హైదరాబాద్ నుంచి కర్నూలు వైపు వెళ్తున్న బనగానపల్లె డిపోకు చెందిన ఆర్టీసీ బస్సును నారాయణపురం స్టేజీ సమీపంలో ఢీకొన్నది. ఆర్టీసీ డ్రైవర్ చెన్నయ్యకు కాలు విరిగిపోయింది. మరో ఇద్దరికి తీవ్ర గాయాలు కాగా, 13 మందికి స్వల్ప గాయాలు అయ్యాయి. క్షతగాత్రులను హైవే, అలంపూర్ అంబులెన్స్‌ల్లో కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మరి కొందరిని వడ్డేపల్లి ప్రాథమిక అంబులెన్స్ ద్వారా స్థానికంగా చికిత్స చేయించారు. ఢీకొన్న వాహనాలు రెండు పెద్దవి కావడంతో 44 జాతీయరహదారిపై దాదాపు మూడు కిలో మీటర్లు మేర భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. విషయం తెలుసుకున్న కోదండాపురం ఎస్‌ఐ క్రిష్ణదేవ్, మానవపాడు ఎస్‌ఐ రాము ట్రాఫిక్ క్లియర్ చేశారు. ఈ సంఘటనపై దర్యాప్తు చేసి కేసు నమోదు చేస్తామన్నారు.


క్షతగాత్రులను అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

గద్వాల టౌన్, జనవరి 28 : ఉమ్మడి జిల్లాలో మత్స్యకారులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషిచేయాలని జోగుళాంబ గద్వాల జిల్లా మత్స్య సహకారం సంఘం చైర్మన్ గోపాల్, వైస్ చైర్మన్ మద్దిలేటి కోరారు. ఆదివారం మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరిని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ముదిరాజ్ కులాన్ని బీసీ-ఎ, బి గ్రూపులో చేర్పించడంతో పాటు కుల వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న మత్స్యకారులకు ప్రభుత్వ పరంగా తగిన తోడ్పాటు అందేలా కృషి చేయాలని కోరారు. కాగా, తమ విజ్ఞప్తికి స్పందించిన మక్తల్ ఎమ్మెల్యే సమస్యను సంబంధిత మంత్రితో పాటు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని చెప్పినట్లు గోపాల్, మద్దిలేటి తెలిపారు.


మక్తల్ ఎమ్మెల్యేను అభినందిస్తున్న గద్వాల జిల్లా మత్స్యకార సంఘం నాయకులు

తిరుమల మెట్లదారిలో వేముల యువకుడి మృతి


మృతి చెందిన రాజేశ్‌రెడ్డి (ఫైల్)

అడ్డాకుల, జనవరి 28 : మూసాపేట మండల పరిధిలోని వేములకు చెందిన ఉంద్యాల రాజేశ్ రెడ్డి(23) శనివారం తిరుమల మెట్లదారిలో గుండెపోటుతో మృతి చెందాడు. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం... స్నేహితులతో కలిసి రెండు రోజుల క్రితం తిరుమలలో వేంకటేశ్వరస్వామి దర్శనం కోసం మెట్ల దారిలో కాలినడకన వెళుతుండగా అకస్మాత్తుగా గుండెపోటు రావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కొడుకు మరణవార్త తెలియడంతో తండ్రి శ్రీనివాస్‌రెడ్డి హైబీపీకి లోనై పక్షవాతానికి గురయ్యాడు. గ్రామస్థులు, కుటుంబ సభ్యులు, తల్లి అంజమ్మ, తిరుమలకు వెళ్లి రాజేశ్‌రెడ్డి మృతదేహాన్ని వేములకు తీసుకొచ్చారు. హైదరాబాద్‌లో ఓ కంపెనీలో మెకానికల్ ఇంజనీర్‌గా పని చేస్తున్న రాజేశ్‌రెడ్డి చిన్న వయస్సులోనే గుండెపోటుతో అకాల మరణం చెందడంతో వేముల గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

జడ్చర్ల, జనవరి 28 : జాతీయ రహదారి జడ్చర్ల మునిసిపాలిటీలోని బురెడ్డిపల్లి సమీపంలోని పెట్రోల్‌బంకు వద్ద రోడ్డుదాటుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీ కొట్టింది. ఈ సంఘటనలో బిహార్ రాష్ట్రంలోని ఈస్ట్ చంపారన్, సంగ్రమ్‌పూర్ ఠాణా, నంద్‌పూర్ గ్రామానికి చెందిన మంటుకుమార్(27) అక్కడికక్కడే మృతిచెందాడు. జడ్చర్ల ఎస్‌ఐ నాగరాజు తెలిపిన వివరాల మేరకు... నంద్‌పూర్ గ్రామానికి చెందిన నవాల్‌మెహతా తన ఇద్దరు కుమారులు ఓంప్రకాశ్, మంటుకుమార్‌లతో కలిసి, బతుకుదెరువు కోసం నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. ఈ నెల 27న సాయంత్రం బిజినేపల్లి నుంచి ఊరికి వెళ్తున్నానని చెప్పి మంటుకుమార్ బయలుదేరాడు. రాత్రి 11.30 నిమిషాల సమయంలో కర్నూల్ నుంచి హైదరాబాద్ వైపు వెళ్లే జాతీయ రహదారిలో రోడ్డు దాటుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీ కొట్టడంతో తల పగిలి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని జడ్చర్ల ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించినట్లు తెలిపారు. విచారణ చేపట్టగా మృతుడి వద్ద ఉన్న మొబైల్ ఫోన్ ఆధారంగా కుటుంబసభ్యులను గుర్తించామని ఎస్‌ఐ తెలిపారు. మంటుకుమార్ తండ్రి నవాల్‌మెహతా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపడ్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య


బాలచంద్రుడు

కొత్తకోట, జనవరి 28 : మనస్తాపం చెంది పురుగుల మందు తాగి వ్యక్తి మృతి చెందిన సంఘటన వనపర్తి జిల్లా కొత్తకోట మండల అప్పరాల గ్రామంలో ఆదివారం చోటు చేసుకున్నది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన బాలంచంద్రుడు (38) భార్య మహేశ్వరితో గొడవ పడడంతో ఆమె పుట్టింటికి వెళ్లింది. దీంతో మనోవేదనకు గురై ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగి స్పృహ కోల్పోయాడు. గమనించిన కుటుంబ సభ్యులు జిల్లా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

మాలధారణం...నియమాల తోరణం

- శివ దీక్షలు ప్రారంభం
- గ్రామాల్లో శివనామస్మరణ

చిన్నచింతకుంట, జనవరి 28 : శివనామస్మరణతో గ్రామాలు పులకించిపోనున్నాయి. భక్తులు మాలధారణ స్వీకరించటం వల్ల నియమ నిష్టలతో పూజలు చేయనున్నారు. జిల్లాలోనే ప్రముఖ శైవక్షేత్రమైన శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం నుంచి శివదీక్షలు ప్రారంభమయ్యాయి. వివిధ మండలాలకు చెందిన దాదాపు 300 మంది దాకా భక్తులు శివ దీక్షను స్వీకరించారు. మండలం లోని దాసర్‌పల్లి, ముచ్చింతల, అప్పంపల్లి, చిన్నచింతకుంట, ఉంద్యాల, దమగ్నాపూర్, బండర్‌పల్లి తదితర గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద ఎత్తున మాలధారణ చేశారు.

41 రోజుల పాటు దీక్ష

శివదీక్షను ఆచరించనున్న భక్తులు 41 రోజుల పాటు అత్యంత నియమనిష్ఠలతో దీక్షను చేపట్టనున్నారు. నేలపైనే నిద్రించటం, ఒక్క పూట భోజనం, ప్రతీ రోజు తెల్లవారుజామునే నిద్రలేవటం, తెల్లవారుజామునే స్నానం ఆచరించి, శివాలయంలో శివునికి అభిషేకాలు చేయటం, ధ్యానం చేయటం, ప్రతీ ఒక్కరినీ శివ అని పలకరించటం, గంధపు రంగుల వస్త్రాలు ధరించటం, నుదుటిపై గంధం బొట్టు పెట్టడం, మెడలో రుద్రాక్షమాలను ధరించటం, రాగి, వెండి, బంగారు గల లోహపు స్వామి వారి ముద్రికను మెడలో వేసుకోవటం, పాదరక్షలు లేకుండా ఉండటం, రెండు, లేదా మూడు సార్లు స్నానం చేసి, స్వామి వారి అభిషేకం చేయటం, ధ్యానం చేయటం, రాత్రికి సన్నిధానంలోనే నిద్రించటం వంటి నియమాలు ఆచరిస్తారు.

దీక్షతో దైవ చింతన

దీక్షను స్వీకరించటం వల్ల మానసిక ప్రశాంతత, దైవ చింతన మరింత పెంపొందించేందుకు దోహదపడుతుంది. నిత్యం దైవ నామస్మరణలో ఉండటం వల్ల, శాంతియుతంగా, మనసు ఎంతో నిర్మలమైనదిగా మారేందుకు దోహదపడుతుంది. సమాజంలో ఎంతో విలువలతో కూడిన వ్యక్తిగా అందరిలోనూ గౌరవం మరింత బలపడుతుంది.


చిన్నచింతకుంట మండలం శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయంలో శివదీక్ష స్వీకరించి, ధ్యానం చేస్తున్న స్వాములు

ముదిరాజ్ ఉద్యోగుల సంఘం డైరీ ఆవిష్కరణ



డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే ఎన్నం శ్రీనివాస్ రెడ్డి

మహబూబ్‌నగర్ (క్లాక్‌టవర్), జనవరి 28 : మహబూబ్ నగర్ ముదిరాజ్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన 2024 సంవత్సరం ఉద్యోగుల డైరీ, క్యాలెండర్‌ను ఎమ్మెల్యే ఎన్నం శ్రీనివాసరెడ్డి, మక్తల్ శాసనసభ్యులు వాకిటి శ్రీధర్ ఆవిష్కరించారు. ఆదివారం ఆయన తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ముదిరాజ్ సంఘం నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో పేర్కొన్నట్లుగా ముదిరాజ్‌లను బీసీ డీ నుంచి బీసీ ఏకు మార్చాలని, రాష్ట్ర స్థాయిలో ముదిరాజ్‌ల జనాభా ప్రాతిపదికన కార్పొరేషన్లో నామినేటెడ్ పదవులకు ప్రాధాన్యత నివ్వాలని, కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసి రూ. వెయ్యికోట్లు కేటాయించాలని వారు శాసనసభ్యులను కోరారు. కార్యక్రమంలో ముదిరాజ్ నాయకులు ఎన్‌పీ వెంకటేష్, సంజీవ్ ముదిరాజ్, ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు బి. జనార్ధన్, కార్యనిర్వాహక అధ్యక్షుడు జె. మధు, ప్రధాన కార్యదర్శి ఎం. విజయబాబు, కార్యనిర్వాహక కార్యదర్శి మడుగు విజయ్ కుమార్, పి. శంకర్ ఎమ్మార్వో, జి. ఆంజనేయులు, సూర్యప్రకాశ్, సత్యనారాయణ, కె. విజయకుమార్, జి. శేఖర్, జి. శ్రీనివాసులు, అరవింద్, శంకర్, శరబందు, మైత్రి యాదయ్య, గోనెల శ్రీనివాస్, పెద్ద విజయకుమార్, శ్రీనివాస్‌రాజు, జ్ఞాన భారతి లక్ష్మణ్, పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా అధ్యక్షుడికి ఘన సన్మానం



బీజేపీ జిల్లా అధ్యక్షుడు పి. శ్రీనివాస్ రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు, కార్యకర్తలు

మహబూబ్‌నగర్ (క్లాక్‌టవర్), జనవరి 28 : భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షుడిగా శ్రీనివాస్ రెడ్డి ఎంపిక కావడం పట్ల ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, జిల్లా నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యాలయంలో శ్రీనివాస్ రెడ్డికి మెమెంటోను అందించి శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పద్మజారెడ్డి, పడాకుల బాలరాజు, సాహితీరెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ అంజయ్య, కృష్ణవర్ధన్‌రెడ్డి, ప్రవీణ్ కుమార్, రాజేందర్ రెడ్డి, హరిక్రిష్ణ, కిష్టానాయక్ ఉన్నారు.

చెన్నకేశవస్వామి ఆలయ చైర్మన్‌గా రవీందర్‌రెడ్డి



ఆలయ చైర్మన్ ఎన్నం రవీందర్‌రెడ్డి

మిడ్జిల్, జనవరి 28 : మండలంలోని వెలుగొమ్ముల గ్రామంలోని శ్రీ లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయ చైర్మన్‌గా యెన్నం రవీందర్‌రెడ్డిని గ్రామస్థుల సమక్షంలో ఆదివారం ఎన్నుకున్నారు. ప్రస్తుతం ఆలయ కమిటీ చైర్మన్‌గా ఉన్న యెన్నం రఘుపతిరెడ్డి చైర్మన్‌గా ఎన్నికై మూడేళ్లు కావడంతో రవీందర్‌రెడ్డిని చైర్మన్‌గా గ్రామ సర్పంచ్ అంజమ్మ, గ్రామ పెద్దల సమక్షంలో ఎన్నుకున్నారు. వైస్ చైర్మన్‌గా గౌరమ్మ, కమిటీ సభ్యులుగా మాసయ్య, జయందర్, మేస్త్రీ సాయన్న, వెంకటయ్యతో పాటు పలువురిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి సహకారంతో ఆలయాన్ని అన్ని విధాల అభివృద్ధి పరిచేందుకు కృషి చేస్తానని రవీందర్‌రెడ్డి తెలిపారు.

'ప్రజా సమస్యలు పరిష్కరించాలి'

హన్వాడ, జనవరి 28 : స్థానికంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు ప్రభుత్వం పరిష్కరించాలని వ్యవసాయ వృత్తిదారుల యూనియన్ రాష్ట్ర గౌరవఅధ్యక్షుడు బాలకిష్టయ్య అన్నారు. ఆదివారం హన్వాడలో ఏర్పాటు చేసిన యూనియన్ సమావేశంలో పలు అంశాలపై చర్చించారు. సంఘాలను బలోపేతం చేయాలని కోరారు. ముఖ్యంగా రేషన్‌కార్డులు, పెన్షన్లు, ఇళ్లు, ఇళ్లస్థలాలు పేదలకు అందాలని, అందుకు క్షేత్రస్థాయిలో గుర్తించి ప్రభుత్వానికి వివరించాలన్నారు. ధరణి సమస్యను పరిష్కరించి పేదలకు న్యాయం చేయాలని కోరారు. యూనియన్ బలోపేతమై సమస్యలపై పోరాటలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర, జిల్లా, మండల నాయకులు వెంకటయ్య, వెంకటేశ్వ రమ్మ, నాగన్న, కిష్టయ్య, అచ్చన్న, రవి పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు రూ.25 వేల వేతనం ఇవ్వాలి



మాట్లాడుతున్న రాష్ట్ర నాయకుడు నాగన్న

హన్వాడ, జనవరి 28 : గ్రామాలలో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులకు రూ.25 వేల వేతనం ఇచ్చి పర్మినెంట్ చేయాలని తెలంగాణ సర్వీస్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.నాగన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం హన్వాడలో పారిశుధ్య కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రస్తుతం ఉన్న విధానాన్ని రద్దు చేసి వారి సమస్యలు పరిష్కరించాలన్నారు. 8 గంటల పని మాత్రమే కల్పించాలని, వారికి రెండు జతల దుస్తులు, బూట్లు, పని సామగ్రి ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు, కార్మికులు స్వాతి, బాలకిష్టయ్య, రాములమ్మ, బాలమణి, రంగయ్య, రాములు పాల్గొన్నారు.

ఆర్‌అండ్‌బీ అతిథి గృహం చుట్టుపక్కల నిర్మిస్తున్న భవనాలను

విజ్ఞాన కేంద్రాలుగా మార్చాలి

- దళిత, ప్రజా సంఘాల డిమాండ్

పాలమూరు, జనవరి 28 : జిల్లా కేంద్రంలో ఆర్‌అండ్‌బీ అతిథి గృహం చుట్టుపక్కల నిర్మిస్తున్న భవనాలను విద్య, విజ్ఞాన కేంద్రాలుగా మార్చాలని దళిత, ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ చౌరస్తాలో దళిత ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ప్రదర్శన చేపట్టారు. నాయకులు మాట్లాడుతూ ఆర్‌అండ్‌బీ అతిథి గృహం దగ్గర గత ప్రభుత్వం చేపలు, మాంసం విక్రయ కేంద్రంగా చేయాలని నిర్ణయించిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ భవనాల చుట్టూ ప్రభుత్వ బాలుర కళాశాల, ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్, ముందు ఇరిగేషన్ కార్యాలయం, తిరుమల తిరుపతి దేవస్థానం కల్యాణ మండపం, 2వ పట్టణ పోలీస్ స్టేషన్, డీఎస్పీ కార్యాలయం, బాలికల కళాశాల, మోడల్ బేసిక్ పాఠశాల, గిరిజన బాలికల వసతిగృహం, ప్రభుత్వ ఎన్‌టీఆర్ డిగ్రీ కళాశాలలు, పక్కనే జడ్పీ కార్యాలయం, సాయిబాబా దేవాలయం, అమరవీరుల స్థూపం, రేణుకా ఎల్లమ్మ దేవాలయం ఉన్నవనే విషయం తెలిపారు. ఇలాంటి భవనాలు ఉన్నచోట మాంసం, చేపలు విక్రయించటం సరికాదని తెలిపారు. వెంటనే వాటిని రద్దుపరిచి విద్య, విజ్ఞాన కేంద్రాలుగా తీర్చి దిద్దాలన్నారు. కార్యక్రమంలో కావలి కృష్ణయ్య, ఎం.సామెల్, బోయపల్లి నరసింహులు, రఘునాథ్, బుక్కిరాములు, కొత్తపేట ఆంజనేయులు, జుట్ల రవి, జాన్సన్, శ్రీరాములు, ఎస్.బాలరాజు పాల్గొన్నారు.

సిద్దోటం పాఠశాలకు వాటర్‌ప్యూరిఫయర్ వితరణ

నవాబ్‌పేట, జనవరి 28 : మండలంలోని సిద్దోటం పాఠశాలకు గ్రామస్థులు వాటర్ ప్యూరీఫయర్ అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం మరికంటి రాములు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలకు గ్రామానికి చెందిన యువకులు రవి, అనిల్ రూ 15000 వెచ్చించి వాటర్ ప్లాంట్ మిషన్లు ఇవ్వడం మంచి నిర్ణయమన్నారు. పూర్వ విద్యార్థులు పాఠశాల అభివృద్ధికి కలిసి రావాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య ఉంటుందని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించాలని కోరారు. పాఠశాలకు మినరల్ వాటర్ ప్లాంట్ ఇచ్చిన దాతలను ఉపాధ్యాయులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజనజాతికి సహకారం అందించాలి

- ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాసరెడ్డి



గిరిజన ఉద్యోగుల సంఘం నాయకులను అభినందిస్తున్న ఎమ్మెల్యే యెన్నం

పాలమూరు, జనవరి 28 : ఆదివాసి, గిరిజనజాతికి మీవంతుగా సహాయ, సహకారాలు అందజేయాలని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాసరెడ్డి సూచించారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని గిరిజన భవన్‌లో గిరిజన ఉద్యోగుల సంఘం జిల్లా కమిటీ ప్రమాణ స్వీకారోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. జిల్లా గిరిజన ఉద్యోగుల సంఘం గౌరవ అధ్యక్షునిగా వి.బలరాం, అధ్యక్షుడిగా కె.రాము, ప్రధాన కార్యదర్శిగా కె.నారాయణ, డి.ప్రియాంక బాయి, కోశాధికారిగా ఎస్.శంకర్, వర్కింగ్ ప్రసిడెంట్‌గా యం.గోపాల్‌లను ఎన్నుకున్నారు. ఎంపికైన కమిటీతో ఎమ్మెల్యే ప్రమాణ స్వీకారం చేయించి ప్రసంగించారు. పేదరికం నుంచి కష్టపడి పైకివచ్చి గిరిజనజాతి బిడ్డలం దరు తమజాతి బిడ్డలు ఎదిగేందుకు చేయూతనందించాలని ఎమ్మె ల్యే సూచించారు. గిరిజనులకు ఎలాంటి అవసరం వచ్చినా 24 గం టలు ఎమ్మెల్యే క్యాంపు ఆఫీసులో అందుబాటులో ఉంటానని తెలిపారు. గిరిజన భవన్ నిర్మాణం కోసం రూ.పది లక్షలు, బోరు వేసేందుకు సహకారం అందజేస్తానన్నారు. రాబోయే సేవాలాల్ మహరాజ్ జయంతి ఉత్సవాలకు వెళ్లేందుకు సేవామడ్డ్ గుత్తి, అనంతపురం వెళ్లేందుకు బస్సును ఏర్పాటు చేస్తానన్నారు. ఉమ్మడి జిల్లాలోని గిరిజన విద్యార్థులు జిల్లా కేంద్రంలో చదువుకోవటానికి రీడింగ్ రూం ఏర్పాటుకు సహకారం అందజేస్తానన్నారు. కార్యక్ర మంలో ఆర్.రవి, కె.సత్యంనాయక్, ఎస్.పాండు, వి.చత్రపతి, వి.రమేష్, యం.రఘువీర్ సింగ్, కె.తిరుపతి, యం.సుమిత్ర పాల్గొన్నారు.

పీఆర్టీయూ తెలంగాణ కార్యవర్గం రద్దు

- వ్యవస్థాపక అధ్యక్షుడు గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, జనవరి 28 : పీఆర్టీయూ తెలంగాణ జిల్లా కార్యవర్గాన్ని పూర్తిగా రద్దు చేసినట్లు ఆ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి తెలిపారు. ఆదివారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన సమావేశం ఆయన మాట్లాడారు జీవో 317, ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులు తదితర అంశా లపై చర్చినట్లు తెలిపారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు జిల్లా అధ్యక్షులుగా వై.శ్యాంబాబు, ప్రధాన కార్యదర్శిగా రమాకాంత్, వర్కింగ్ ప్రసిడెంట్‌గా నాగిరెడ్డి, కోశాధికారిగా దండు రాఘవ, జిల్లా ఉపాధ్యక్షులుగా నాగనాథ్, రాష్ట్ర ఉపాధ్యక్షులుగా ఏ.జైపాల్‌రెడ్డి, రాష్ట్రకార్యదర్శి జి.ఆనంద్, మహిళ విభాగం రాష్ట్ర కార్యదర్శిగా అనురాధ, భీమ్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా భూపతి సింగ్‌లను ఎన్నుకున్నారు. ఈ ఎన్నికల అధికారిగా నాగర్‌కర్నూల్ సీనియర్ నాయకులు సాయిరెడ్డి నిర్వహించారు. క్రమశిక్షణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యుగేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

'గిరిజన ఉద్యోగుల హక్కుల కోసం పోరాడుదాం'

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, జనవరి 28 : గిరిజన ఉద్యోగుల హక్కుల కోసం జాతిహక్కుల కోసం పోరాటం చేయాలని గిరిజన ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు గోపాల్‌నాయక్, డి.రాజు నాయక్‌లు అన్నారు. ఆదివారం గిరిజన భవన్‌లో నూతనంగా ఎన్నికైన గిరిజన ఉద్యోగుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు గోపాల్‌నాయక్, గంగారామ్‌నాయక్‌లు కార్యవరగ సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా గిరిజన నాయకులు వారిని అభినందించారు. ఈ కార్యక్ర మంలో రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌నాయక్, గిరిజన సేవాసంఘం అధ్యక్షుడు రాజునాయక్, ప్రధానకార్యదర్శి యాదగిరి, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్‌నాయక్, చంద్రనాయక్, అంతిరామ్‌నాయక్, బావాజీనాయక్, తుల్సిరాంనాయక్, దశరథనాయక్, రాములునాయక్ పాల్గొన్నారు.

పురపాలక అభివృద్ధికి కృషి

- మాజీ మంత్రితో కలిసి పని చేయడం అదృష్టం

- తాజా మాజీ మునిసిపల్ చైర్మన్ నర్సింహులు



మాట్లాడుతున్న మునిసిపల్ తాజా మాజీ చైర్మన్ కేసీ నరసింహులు

పాలమూరు, జనవరి 28 : మాజీ మంత్రి డాక్టర్ వి.శ్రీనివాస్‌గౌడ్‌తో కలిసి మహబూబ్‌నగర్ అభివృద్ధి కోసం పనిచేశానని మహబూబ్‌నగర్ తాజామాజీ మునిసిపల్ చైర్మన్ కె.సి.నరసింహులు అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు మహబూబ్‌నగర్ మునిసిపల్ ఈ స్థాయిలో అభివృద్ధి ఉందా? అని ప్రశ్నించారు. హైదరాబాద్‌కు సమాంతరంగ మాజీ మంత్రి అభివృద్ధి చేశారని గుర్తు చేశారు. డమ్మీ చైర్మన్ అని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాసరెడ్డి తనపై మాట్లాడటం సరికాదని ఆయన అన్నారు. రాత్రికి రాత్రి పార్టీలు మారే మీరు మాపై విమర్శలు చేయటం తగదన్నారు. బీసీనైనా తాను చైర్మన్‌గా ఉండకూడదా అని ప్రశ్నించారు. అవినీతికి అవకాశం లేకుండా పనిచేశానని, బీసీలని అవమానించే విధంగా మాట్లాడితే మా సంఘాలు ఊరికే ఉండవని అన్నారు. మీలా రాజకీయం చేయనందుకు నేను డమ్మినా ? అని అన్నారు. మీ పార్టీలో నాయకులు ఒక్కొక్కరు ఒక్కో డిపార్ట్‌మెంట్ పంచుకుని పనిచేస్తున్నారని విమర్శించారు. మాజీ మంత్రి అభివృద్ధికి నిధులు తీసుకువస్తే కాంగ్రెస్ పార్టీ నాయకులు రూ.పది లక్షలు ఇస్తామని అంటున్నారని, మా కౌన్సిలర్లు చాలామంది నాతో చెప్పారని నర్సింహులు గుర్తు చేశారు. కౌన్సిలర్లు అన్ని విధాలుగా లబ్ధిపొంది ఇప్పుడు కాంగ్రెస్ పార్టీలోకి పోయిండ్రని అన్నారు. ఎమ్మెల్యేనుద్దేశించి మాట్లాడుతూ మీకు దమ్ము, ధైర్యం ఉంటే మీ 35 మంది కౌన్సిలర్లను రాజీనామా చేయమని చెప్పాలని అన్నారు. నికార్సయిన మా 14 మంది కౌన్సిలర్లు కూడా రాజీనామా చేస్తారని, ప్రజాక్షేత్రంలో తేల్చుకుందామని అన్నారు. నాలుగేళ్లపాటు నాకు చైర్మన్‌గా అవకాశం ఇచ్చిన మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, కౌన్సిలర్స్‌కు, బీఆర్‌ఎస్ పార్టీకి, ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో ముడా చైర్మన్ గంజి వెంకన్న, బీఆర్‌ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు శివరాజు పాల్గొన్నారు.

ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ అధికార ప్రతినిధికి అభినందనలు

- ఢిల్లీకి తరలిన ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి, కాంగ్రెస్ శ్రేణులు



మల్లురవి ప్రమాణస్వీకారోత్సవంలో పాల్గొన్న జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

జడ్చర్ల/ నవాబ్‌పేట/ బాలానగర్, జనవరి 28 : ఢిల్లీలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధిగా టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షులు, మాజీ ఎంపీ డాక్టర్ మల్లు రవి ఆదివారం ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో ప్రమాణస్వీకారం చేశారు. ప్రమాణస్వీకారోత్సవం కార్యక్రమానికి జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి పాల్గొన్నారు. ప్రమాణ స్వీకారం అనంతరం డాక్టర్ మల్లురవిని ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి సన్మానించారు. ఈ ప్రమాణస్వీకారోత్సవ కార్యక్రమంలో జడ్చర్ల నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. నవాబ్‌పేట మండల నాయకులు మల్లేష్ యాదవ్, కొల్లూర్ ఖాజ, దార భాస్కర్‌లు ఆదివారం ఢిల్లీ వెళ్లి మల్లు రవిని సన్మానించారు. నమ్మిన వారికి అండగా నిలచే మల్లురవి ముందు మరిన్ని పదవులు చేపట్టాలని వారు ఆకాంక్షించారు. మల్లురవి నియమాకం పట్ల బాలానగర్ మండల నాయకులు శనివారం హర్షం వ్యక్తం చేశారు. బాలానగర్ మండలం నుంచి నాయకులు ఆది రమణారెడ్డి, నర్సింహారెడ్డి, గౌతంగౌడ్, ఆదిత్యరెడ్డి, మురళీధర్‌రెడ్డి, భాస్కర్‌నాయక్‌లు హాజరై ఆయనను శాలువాలతో సన్మానించారు. డాక్టర్ మల్లురవి ఢిల్లీలో అధికార ప్రతినిధిగా నియమాకం కావడం పట్ల జిల్లాకే గర్వకారణమన్నారు.

గ్రామాల అభివృద్ధే లక్ష్యం

- పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి



అభివృద్ధి పనుల ప్రారంభంలో పరిగి ఎమ్మెల్యే టి. రామ్మోహన్‌రెడ్డి

గండీడ్/ మహమ్మదాబాద్, జనవరి 28 : గ్రామాల అభివృద్దే లక్ష్యం అని పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్ రెడ్డి అన్నారు. ఆదివారం గండీడ్ మండల పరిధిలోని కొంరెడ్డిపల్లి నూతన గ్రామ పంచాయతీ భవనం ప్రారంభం, సల్కర్‌పేట్‌లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, గ్రామ పంచాయతీ భవనం పనులకు భూమి పూజ, వెన్నాచేడ్ గ్రామాల్లో మత్స్య సహకార సంఘం నూతన భవనానికి భూమి పూజతో పాటు పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. అలాగే మహమ్మదాబాద్ మండల పరిధిలోని నంచర్ల గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నూతనంగా నిర్మించిన అదనపు తరగతిగదులను ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి ప్రారంభించారు. అదేవిదంగా గ్రామంలో నిర్మించిన సీసీ రోడ్డు పనులను ఆయన ప్రారంభించారు. అదేవిధంగా మండల పరిధిలోని సంగాయపల్లిలో నిర్మించిన నూతన గ్రామపంచాయతీ భవనాన్ని, దర్మాపూర్‌లో అంగన్‌వాడీ భవనాన్ని స్థానిక నాయకులతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా నంచర్ల జిల్లాపరిసత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు సరిపడా వసతులు కల్పించి, వారికి నాణ్యమైన విద్యనందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. ఆయా కార్యక్రమాల్లో గండీడ్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి, సర్పంచులు ప్రభాకర్‌రెడ్డి, పుల్లారెడ్డి, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, అనంతలక్ష్మారెడ్డి, వెన్నాచేడ్ మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు బి.గోపాల్, నర్సిములు ఎంపీటీసీలు, నరోత్తంరెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, పులిందర్‌రెడ్డి, అధికారులు ఎంపీడీవో శంకర్‌నాయక్, పీఆర్ ఏఈ రాబర్ట్, మహమ్మదాబాద్ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కేఎం నారాయణ, సర్పంచ్ అనసూయ, నర్సమ్మ, చాందీబాయి, పీఏసీఎస్ అధ్యక్షుడు కమతం శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీపీ శాంతిరంగ్యా ఎంపీడీవో శంకర్‌నాయక్, ఏఈ మతీన్, డీసీసీ నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, గిరిధర్‌రెడ్డి పాల్గొన్నారు.

● టీపీఆర్టీయూ క్యాలెండర్ ఆవిష్కరించిన ఎమ్మెలే : తెలంగాణ పీఆర్టీయూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రూపొందించిన 2024 సంవత్సరం టేబుల్ క్యాలెండర్‌ను పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు అంకితభావంతో పని చేయాలన్నారు. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. పదిలో మంచి ఫలితాలు సాధించేందుకు నిరంతరం కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో టీపీఆర్టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మరికంటి బాలరాజు, విజయ్‌భూషన్, నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మోదీ ప్రభుత్వాన్ని గద్దె దించాలి

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.బాలనరసింహ



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు యం.బాలనరసింహ

పాలమూరు, జనవరి 28 : రాజకీయ లబ్ధి కోసమే రాముడి జపం చేస్తూ, మతమౌఢ్యంతో ఉన్న మోదీ ప్రభుత్వాన్ని గద్దెదించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం.బాలనరసింహ ప్రజలకు పిలుపునిచ్చారు. ఆదివారం జిల్లా కేంద్రంలో సీపీఐ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన జిల్లా కమిటీ, సమితి సమావేశాలు పి.సురేష్ అధ్యక్షతన జరిగాయి. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన పలు విషయాలను వివరించారు. మోదీ ప్రభుత్వం భారత రాజ్యాంగ పీఠికకు సమాధి కడుతూ రాజ్యాంగ స్థానంలో మనుధర్మ సిద్ధాంతాన్ని అమలు చేసేందుకే దేశంలో విద్వేషపు మతచిచ్చుకు ఆజ్యంపోస్తోందన్నారు. దేవాలయంలో కొలువదీరాల్సిన రాముడికి రాజకీయ రంగులు అద్దుతున్నారని, ఓటు బ్యాంకు పెంచుకునే విధంగా పాలన తంతు సాగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు మోదీ ప్రభుత్వం ప్రజలకిచ్చిన హామీలను ఏ ఒక్కటి అమలు చేయలేదని అన్నారు. నల్లధనం తెచ్చి ప్రతి కుటుంబానికి రూ.15లక్షలు జమ చేస్తామని చెప్పినదానిపై శ్వేతపత్రం విడుదల చేయాలని కోరారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమికి ఓటమి తప్పదన్నారు. సమావేశంలో సీపీఐ జిల్లా సమితి కార్యదర్శి బి.బాలకిషన్, సభ్యులు డి.రాము, అల్వాల్‌రెడ్డి, బి.ఆర్.విల్సన్, చాంద్‌పాషా, అమరజ్యోతి, సంతోష్, శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమావేశం



కొల్లూర్‌లో సమావేశమైన పూర్వ విద్యార్థులు

నవాబ్‌పేట, జనవరి 28 : మండలంలోని కొల్లూర్ గ్రామంలో 1999-2000ల సంవత్సరానికి చెందిన పదవ తరగతి విద్యార్థులు సమావేశమై నాటి తీపి జ్ఞాపకాలు నెమరు వేసుకున్నారు. వారికి చదువు చెప్పిన గురువులను పాఠశాలకు పాదాభివందనం చేసి ఘనంగా సన్మానించారు. తమలో ఒకరు చౌదూర్ సర్పంచ్‌గా ఎన్నికవ్వడం పట్ల హర్షం వ్యక్తం చేస్తు సర్పంచ్ వెంకటయ్యను సన్మానించారు. జీవితంలో వివిధ రంగాలలో స్థిరపడిన తమకు నాటి గురువులే ఆదర్శమన్నారు. ఈ కార్యక్రమంలో చౌదూర్ నాగరాజు, సుధాకర్, శేఖర్, డీ.ఆంజనేయులు, గిరి, రామకృష్ణారెడ్డి, యాదయ్య, కుమార్, శ్రీనివాస్, మాదవ్, పాపయ్య పాల్గొన్నారు.

వేబిల్లు లేకుండా ఇసుక తరలిస్తే చర్యలు : పీవో

మహబూబ్‌నగర్, జనవరి 28 : ఇసుక అక్రమంగా రవాణాపై టీఎస్‌ఎండీసీ అధికారులు విస్తృత తనిఖీలు నిర్వహించారు. టీఎస్‌ఎండీసీ పీవో దశరథ్ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లాలో పెద్దఎత్తున తనిఖీలు నిర్వహించారు. ఆరు మంది రెండు బృందాలుగా ఏర్పాటు ఉమ్మడి జిల్లాలో పలుచోట్ల తనిఖీలు చేపట్టారు. వేబిల్లులు లేకుండా ఇసుక తరలిస్తే రూ.50 వేలు జరిమానా, అధికలోడ్‌తో వెళితే రూ.2వేలు జరిమానా విధిస్తామని హెచ్చరించారు. ఇప్పటికే ఇసుక అక్రమ రవాణాపై నిఘాపెట్టి కట్టడి చేశామని, ఇంకా కొందరు గుట్టు చప్పుడు కాకుండా ఇసుక తరలిస్తున్నారని, కఠినచర్యలు తీసుకుంటామన్నారు.

సేవాలాల్ జయంతి ఉత్సవ కమిటీ ఎన్నిక

నవాబ్‌పేట, జనవరి 28 : సేవాలాల్ జయంతి ఉత్సవ నూతన కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు కొల్లూర్ ఎంపీటీసీ తులసీ రాం నాయక్ తెలిపారు. మండల కేంద్రంలోని గిరిజన భవవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో నూతన కమిటీ అధ్యక్ష, కార్యదర్శులను ఎన్నుకున్నట్లు తెలిపారు. అధ్యక్షులుగా తులసీరాం, ప్రధాన కార్యదర్శిగా సంతునాయక్, గౌరవ అధ్యక్షులుగా లింబ్య నాయక్, చందర్ నాయక్, శంకర్ నాయక్, రాజు నాయక్, నీల్యానాయక్‌లను ఎన్నుకున్నట్లు తెలిపారు. మండలంలో గిరిజన సమస్యలు, వారి అభివృద్ధి కోసం కమీటి పని చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

'పార్లమెంట్ సీటు బీసీలకు ఇవ్వాలి'

బాలానగర్, జనవరి 28 : పార్లమెంట్ సీటును బీసీలకు ఇవ్వాలని రజక సంఘం నాయకులు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో కూడా బీసీలకు అన్యాయం చేశారని, పార్లమెంట్‌లోనైనా బీసీలకు సీటు ఇవ్వాలని పార్టీ నాయకులను కోరారు. ఈ కార్యక్రంలో నాయకులు శంకర్, భాస్కర్, కృష్ణయ్య, జంగయ్య యాదయ్యలు పాల్గొన్నారు.

కోయిలకొండ ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన రాఘవేందర్

కోయిలకొండ, జనవరి 28 : నూతన ఎస్ఐగా రాఘవేందర్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. మండలంలో పని చేస్తున్న ఎస్ఐ విజయభాస్కర్ జిల్లా కేంద్రానికి బదిలీపై వెళ్లడంతో ఆయన స్థానంలో జడ్చర్లలో పని చేస్తున్న రాఘవేందర్ కోయిలకొండలో బాధ్యతలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ మండలంలో శాంతియుత వాతావరణం నెలకొనేల చూస్తానని, అందరు సహకరించాలని తెలిపారు. మండలంలో ఇసుక అక్రమ రవాణా సమస్య ఉందని, దానిని అదుపులోకి తీసుకొస్తానని అన్నారు. ప్రభుత్వ అనుమతులు ఉంటేనే ఇసుకకు అనుమతి ఇస్తామని తెలిపారు. అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పీఏసీఎస్ చైర్మన్‌గా కమతం శ్రీనివాస్‌రెడ్డి



కమతం శ్రీనివాస్‌రెడ్డి

మహమ్మదాబాద్, జనవరి 28 : ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్‌గా కమంతం శ్రీనివాస్‌రెడ్డి కోఆపరేటివ్ ట్రిబ్యునల్ ఉత్తర్వుల మేరకు నియమితులయ్యారు. ఇందుకు సంబంధించి ఈ నెల 31 వరకు కమతం శ్రీనివాస్‌రెడ్డి చైర్మన్‌గా కొనసాగుతారని ట్రిబ్యునల్ ఉత్తర్వులో పేర్కొంది. గత నవంబరు 11 ఉమ్మడి గండీడ్ మండల పీఏసీఎస్ సభ్యులు చైర్మన్‌గా ఉన్న కమతం శ్రీనివాస్‌రెడ్డిపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టారు. ఆ సమయంలో తొమ్మిది మంది సభ్యులు శ్రీనివాస్‌రెడ్డికి వ్యతిరేకంగా ఓటు వేయ డంతో అప్పట్లో పదవి కోల్పోయిన విషయం తెలిసిందే. తాత్కాలిక చైర్మన్‌గా, వైస్ చైర్మన్‌గా కొనసాగుతున్న లక్ష్మీనారాయణకు చైర్మన్ బాధ్యతలు అప్పజెప్పారు. దీంతో శ్రీనివాస్‌రెడ్డి ట్రిబ్యునల్‌ను ఆశ్రయించారు. దీనిపై ట్రిబ్యునల్ తీర్పు వెలువరించింది. తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు ఆయనే చైర్మన్ కొనసాగనున్నారు.

సంకలమద్దిలో బూత్ కమిటీల ఎన్నిక

అడ్డాకుల, జనవరి 28 : మూసాపేట మండల పరిధిలోని సంకలమద్దిలో ఆదివారం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శెట్టిశేఖర్, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సూదిరెడ్డి లక్ష్మీకాంత్‌రెడ్డిల ఆధ్వర్యంలో బూత్ యూత్ కమిటీని ఎన్నుకున్నారు. 83వ బూత్ యూత్ అధ్యక్షునిగా సిద్ధేశ్వర ముదిరాజ్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు రత్నయ్య, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

వచ్చే నెల 10 నుంచి లక్ష్మీచెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు

జడ్చర్ల, జనవరి 28 : జడ్చర్ల మండలంలోని గంగాపురం శ్రీ లక్ష్మీచెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలను ఫిబ్రవరి 10వ తేదీ నుంచి 18వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వాహక అధికారి దీప్తిరెడ్డి ఆదివారం తెలిపారు. బ్రహ్మోత్సవాలలో భాగంగా 10న అలంకారాభిషేకం, 11న అంకురార్పణం, పల్లకీసేవ, 12న ధ్వజారోహణం, హనుమత్ వాహన సేవ, 13న తిరుకల్యాణం, 14న మనోహరమైన రెండు సేవలు, 15న పుష్పరథం, 16న రథోత్సవం (పెద్దతేరు), 17న శకటోత్సవం, 18న చక్రతీర్థంతో బ్రహ్మో త్సవాలు ముగుస్తాయని వివరించారు. బ్రహ్మోత్సవాలకు భక్తులు వివిధ ప్రాంతాల నుంచి అత్యధికసంఖ్యలో వస్తారని, వారికి అన్ని సౌకర్యాలు, సదుపాయాలు కల్పించనున్నట్లు పేర్కొన్నారు.

జహీర్ ఎంపిక పట్ల హర్షం

నవాబ్‌పేట, జనవరి 28 : మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, పీసీసీ అధికార ప్రతినిది జహీర్ అక్తర్ లోక్ సభ ఎన్నికల ఇంచార్జీగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేయడం పట్ల మండల కాంగ్రెస్ నాయకులు షబ్బీర్ అలీ, కాకర్లపాడ్ ఖైనుద్దీన్‌లు ఆదివారం హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాబోయె ఎన్నికల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా వంశీచంద్ విజయం సాధిస్తారని ధీమా వ్యక్తం చేశారు. నవాబ్‌పేట మండలంలో కాంగ్రెస్ భారీ మెజార్టీ సాధిస్తుందన్నారు.

మూడున రక్తదాన శిబిరం

జడ్చర్ల, జనవరి 28 : జడ్చర్ల మాజీ ఎమ్మెల్యే బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ సి.లక్ష్మారెడ్డి జన్మదినం సందర్భంగా ఫిబ్రవరి 3న రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు బీఆర్‌ఎస్ పార్టీ జడ్చర్ల మండల అధ్యక్షుడు రఘుపతిరెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని చంద్రా గార్డెన్స్‌లో రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సి.లక్ష్మారెడ్డి జన్మదినం సందర్భంగా ప్రతి సంవత్సరం రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు, అందులో భాగంగా ఈ సంవత్సరం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. రక్తదాన శిబిరంలో నియోజకవర్గంలోని అన్ని గ్రామాల నుంచి అలాగే జడ్చర్ల మునిసిపాలిటీలో నుంచి అత్యధికమంది రక్తదానం చేసి, శిబిరాన్ని విజయవంతం చేయాలని కోరారు.